

హైదరాబాద్ వార్త





# సమాచారం ఇవ్వొద్దు.. మోసపోవద్దు..!



### రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
### బ్యాంక్ వివరాలు ఎవరికి చెప్పొద్దు
### అత్యాశకు పోతే ఉన్న నగదు మాయం

హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త: సార్ మేము బ్యాంకు నుండి మాట్లాడుతున్నాం మీ డెబిట్ కార్డు కాల పరిమితి ముగిసింది. కార్డు నెంబర్, పిన్ నెంబర్ మాకు చెప్తే దానిని పొడిగిస్తాం.అంటూ వాటిని సేకరించి నిమిషాల వ్యవధిలో కార్డు నుండి వేలాది రూపాయలను స్వాహా చేస్తున్నారు. మరికొందరు మీపాన్ నెంబర్‌ను అప్‌డేట్ చేస్తాం.ఆర్‌బిఐ ఉత్తర్వులు మేరకు తప్పకుండా చేయించుకోవాలి మీకార్డు వివరాలు ఇవ్వండని కొందరు, విదేశాల్లో మీ పిల్లలు విద్యాభ్యాసం చేస్తున్నారు కదా.మాట్రస్ట్ తరపున అలాంటి వారికి సహాయం చేస్తున్నాం, మీబ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వండి అంటూ ఖాతా నుండి డబ్బులు డ్రా చేస్తున్నారు. అంతే కాకుండా మీఖాతాలో ఎక్కువ డబ్బు ఉంది కదా. అలాంటి ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందంటూ మరికొందరు. మీకు విదేశీ లాటరీ తగిలింది లక్షల్లో డబ్బులు వస్తాయి. మినిమం లక్షరూపాయలు వేయండంటూ ఇంకొందరు ఇలా సామాన్యులను ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో మోసగిస్తునే ఉన్నారు. కొందరు అత్యాశకు పోయి డబ్బును చేతులారా చేజార్చుకుంటుండగా మరికొందరు అవగాహన లేక సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోతున్నారు. ప్రతిరోజు రకరకాల నేరస్తులను చూసే ఓఎస్‌ఐ స్వయంగా బ్యాంకు ఖాతా వివరాలు గుర్తు తెలియని కొందరు ఫోన్‌చేస్తే అందించగా ఖాతా నుండి 50వేల వరకూ ఖాళీ అయ్యాయి. బడా బాబులు కొందరు బ్యాంకులను మోసగిస్తున్నా కొందరు సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగిస్తూ బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డుల నుండి సొమ్ము కాజేస్తున్నారు.


**ఈమెయిల్స్‌ద్వారా..** వ్యాపారస్తులు, మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు కోటి రెండుకోట్ల రూపాయల వార్షిక టర్నోవర్ ఉన్న కంపెనీల వివరాలు సేకరిస్తున్నారు. కంపెనీ తయారు చేసే ఉత్పత్తుల గురించి తెలుసుకొని తమకు పెద్ద ఎత్తున సరుకు కావాలంటూ ఈమెయిల్స్ పంపిస్తున్నారు. విదేశాల వినియోగదారులుగా పరిచయం చేసుకుంటున్నారు. ఆర్డర్ కావాలంటే కాషన్ డిపాజిట్ నిబంధనలు పెట్టి లక్షలు కొల్లగొడుతున్నారు. ఈఏడాది మూడు కమిషనరేట్ల పరిధిలో పది కంపెనీల నుండి సుమారు ఇరవై లక్షల రూపాయలు వసూలు చేశారు.

**ఈ జాగ్రత్తలు అవసరం..** మీ ఈ మెయిల్‌కు వచ్చే లింకుల ద్వారా బ్యాంకు వెబ్‌సైట్‌లలోకి వెళ్ళొద్దు. మొబైల్ ఫోన్, కంప్యూటర్ ఆర్థిక లావాదేవీలు హాక్‌కాకుండా యాంటీవైరస్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. పబ్లిక్ వైఫై ఉపయోగిస్తూ ఆర్థిక లావాదేవీలు చేయకపోవడం మంచింది. వెబ్‌సైట్‌లు హెచ్‌టీటీపీఎస్‌తో మొదలవుతున్నాయా లేదా గమనించాలి. అనుమానం వస్తే వెంటనే బ్యాంకుకు ఫోన్‌చేసి వాకబ్ చేయాలి. ఏదైనా మోయిల్‌ను పొరపాటున క్లిక్ చేస్తే వెంటనే ఆవిషయాన్ని బ్యాంక్ అధికారులకు చెప్పి ఖాతాకు సంబంధించిన లావాదేవీలు స్థంభింపచేయాలి.

# కాసులు కురిపిస్తున్న కొత్త కనెక్షన్లు

### నగర శివార్లలో జోరుగా సాగుతున్న అవినీతి దందా
### డిటిఆర్, ప్యానల్ బోర్డులకు అధిక మొత్తంలో వసూళ్లు
### చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు
### అడిగినంత చెల్లించలేక వినియోగదారుల గగ్గోలు





హైదరాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త: కొత్తవిద్యుత్ కనెక్షన్లు, లైన్లు అపార్టుమెంట్లకు ప్యానల్‌బోర్డులు, డీటీఆర్‌ల మంజూరు విద్యుత్ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తుంది. గ్రేటర్ పరిధిలో కొత్త వెంచర్లు,బహుళ అంతస్తుల నిర్మాణాలు, వాణిజ్య సముదాయాలు, అధికంగా ఉన్న కొండాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, కూకట్‌పల్లి ,మేడ్చల్ డివిజన్లలో కొత్తకనెక్షన్లకు అక్రమ వసూళ్ల జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని ఆయా డివిజన్‌ల పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడం, రోజుకో కొత్తవెంచర్ వెలుస్తుండటం, గేటెడ్ కమ్యూనిటీ హాల్స్, విలాసవంతమైన విల్లాలు బహుళ అంతస్థుల భవనాలు, వ్యాపార సముదాయాలు వెలుస్తుండటం ఇక్కడి అధికారులకు కాసులవర్షం కురుస్తుంది. కొత్తలైన్లకు సంబంధించిన వర్క్ ఎస్టిమేషన్ మొదలుకొని బహుళఅంతస్తులు ప్యానల్ బోర్డులు, డీటీఆర్ మీటర్లు జారీ వరకు ఇలా ప్రతి పనిలోనూ ఇంజనీర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో చాలా వివాదాలు ఉన్నాయి. ఇక్కడ చేపట్టే కొత్త నిర్మాణాలకు ఎలాంటి కనెక్షన్లు మంజూరు చేయకూడదని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్ర స్థాయిలో అధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. అడిగినంత ముట్టచెప్పితే చాలు మీటర్లే కాదు ఏకంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్డులు మంజూరు చేస్తున్నారు. ఒక్కో కనెక్షన్‌కు బహుళ అంతస్థుల నిర్మాణాన్ని బట్టి ధరలు నిర్ణయిస్తు న్నారు. అదేమంటే పోస్టింగ్ కోసం తాముకూడా భారీగా చెల్లించాల్సి వచ్చిందని పెట్టిన ఖర్చులు తిరిగి సంపాదించుకోవాలంటే అడిగినంత ఇవ్వక తప్పదని స్వయంగా ఇంజనీర్లే స్పష్టం చేయడం విశేషం.

**కాంట్రాక్టర్లు వాళ్ల మనుషులే..** విద్యుత్‌శాఖలో అవినీతిని రూపుమాపేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇంజనీర్ల వేతనాలను భారీగా పెంచింది. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఏఉద్యోగికి ఇవ్వనంత విద్యుత్ ఉద్యోగులకు చెల్లిస్తుంది. రూ,లక్షల్లో వేతనం వస్తున్నా అవి చాలవంటూ ఇంజనీర్లు అక్రమ సంపాదనకు అడ్డదారులు తొక్కుతు న్నారు. కేవలం కొత్త కనెక్షన్లు మంజూరులోనే కాదు వర్క్ ఎస్టిమేషన్, టెండర్ల కేటాయింపులోనూ భారీగా చేతివాటం ప్రదర్శిస్తు న్నారు. బంధువులు, ఇతరులను బినామీలుగ పెట్టుకుని కాంట్రాక్ట్ వర్క్‌లు దక్కించుకుంటున్నారు. ఇదే అశంపై ఇటీవల పలువురు కాంట్రాక్టర్లు ఆందోళనకు కూడా దిగారు. ఇటీవల జరుగుతున్న అక్రమ వసూళ్లపై వినియోగదారులు ఏసిబిని ఆశ్రయిస్తున్నారు. కొందరు అధికారుల్లో మార్పురావడంలేదని పేర్కొంటున్నారు.

## భారత్ జోడో యాత్రను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు,మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్,చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ వెంకటేష్

చార్మినార్,అక్టోబరు 11 ప్రభాతవార్త : దేశాన్ని ఐక్యం చేయటానికి కాంగ్రెస్ అధినేత ఎంపి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. భారత జోడో పాదయాత్ర ఈ నెల 23వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేవిస్తుందని,అక్టోబరు నెల 31న చార్మినార్ వద్దకు చేరుకునే నేపథ్యంలో టిపిసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్ అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్‌లో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చార్మినార్ వద్దకు వస్తున్న సందర్బంగా పాతబస్తీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఘన స్వాగతం పలికి యా త్రను విజయ వంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో పాతబస్తీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలి

చిక్కడపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త: కార్యకర్తలు నాయకులు బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ముషీరాబాద్ ఎమెల్యే ముఠాగోపాల్ అన్నారు. స్థానిక ఫార్స్ గుట్టలో టిఆర్ఎస్ సీనియర్ నేత సోమసుందరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా తో కలిసి ప్రారంభించారు.

## పద్మఅవార్డుకు వంశీ రామరాజు అర్హులు

### ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు



డాక్టర్ వంశీ రామరాజుకు 'ఘంటసాల సేవా శిరోమణి పురస్కారం ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త: 50 సంవత్సరాలు ఒక సాంస్కృతిక సంస్థను నిరాటకంగా నడపడమే కాక వికలాంగుల ఆశ్రయం స్థాపించి వందల మంది అనాధ పిల్లలకు ఆశ్రయం ఇచ్చి వారికి విద్యనేర్పి ఉపాధి కల్పించిన వంశీ ఇంటర్నేషనల్ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు పద్మఅవార్డుకు అర్హులని ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ అభినందనలతో సుజారమణ కల్చరల్ అకాడమి సద్గురు ఘంటసాల జయంతి సందర్భంగా కళాబ్రహ్మ, శిరోమణి డాక్టర్ వంశీ రామరాజుకు 'ఘంటసాల సేవా శిరోమణి పురస్కారం' ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. 366 రోజుల ఘంటసాల స్వరరాగ మహాయాగ నిర్వహించడంతోపాటు ఎంతో మంది గాయనీ గాయకులకు, కళాకారులకు పురస్కారాలను అందించి చరిత్ర సృష్టించిన వ్యక్తి వంశీ రామరాజు అని వక్తలు కీర్తించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రేలంగి నరసింహారావు ఈ పురస్కారాన్ని వంశీ రామరాజుకు అందించి గౌరవించారు. ప్రత్యేక అతిథులుగా మేడిది సుబ్బయ్య ట్రస్ట్ అధినేత ఎం.వి.రావు, నిర్వాహక సంస్థ అధ్యక్ష,కార్యదర్శులు పి.వి.రమణారావు, సుజారమణ, వంశీ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజతదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'హిమగిరి సొగసులు-మురిపించను మనుసులు' పేరుతో సినీ సంగీత విభావరిలోగాయనీ గాయకులు బాలకామేశ్వరరావు, ఎన్.మురళీధర్, అర్చన వెంకటేశ్వరరావు, భైరి శ్రీనివాస్, నాగరాజారావు, జి.శ్రీనివాస్, శివరామకృష్ణ, కె.వి.రావు, రవిశంకర్ ఠాగూర్, సిహెచ్.మూర్తి, గంటి రామకృష్ణ, వి.లింబాద్రి, పాండురంగప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, శ్యామల, రాజ్యలక్ష్మి, సత్యదీప్తి, లక్ష్మీభారతి, సాయిపావని, వాణిమాల, గంటి శైలజ, అరుణ, సావిత్రి ప్రభాకర్, సుజన తదితరులు అద్భుతంగా గానం చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం సంగీత శాఖలో వంశీ-ఘంటసాల స్వర్ణపతకం రెండున్నర లక్షలతో ఉత్తమ సంగీత విద్యార్థికి ప్రతియేట బహుకరించే విధంగా ఏర్పాటుచేయడం, ఘంటసాలకు గుడికట్టి నిత్య ఆరాధన కార్యక్రమం చేయడం అభినందనీయమన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ ఘంటసాల స్వరరాగ మహాయాగం గిన్నీస్ బుక్‌లో నమోదు కావాల్సిన అపురూప కార్యక్రమం అని, వారే తెలుసుకుని రావాలన్నారు.

## ములాయంసింగ్ యాదవ్‌కు భారతరత్న ఇవ్వాలి

### తెలంగాణ యాదవ సంఘాల ఐక్య వేదిక డిమాండ్



ములాయం చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న వర్రె వెంకటేశ్వర్లు, చక్రధర్‌యాదవ్, కృష్ణయాదవ్, మహేష్‌యాదవ్

హైదరాబాద్, అక్టోబరు 11,ప్రభాతవార్త: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ మరణం దేశంలోని బడుగు బలహీనవర్గాలకు తీరనిలోటని కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారత్న రత్న ఇచ్చి గౌరవించి .. పార్లమెంట్‌లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించాలని తెలంగాణ యాదవ్ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆర్టీఐ మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు, యాదవ్ మహాసభ అధ్యక్షులు చక్రధర్‌యాదవ్ టిజివో గ్రేటర్ అధ్యక్షులు ఎంబి.కృష్ణయాదవ్, తదితరులు హాజరై ములాయంచిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ములాయంసింగ్ యాదవ్ కేంద్రమం త్రిగా.. 3సార్లు యూపి ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. ఆయన హయాంతో బడుగు బలహీనవర్గాల ఎన్నో అవకాశాలను కల్పించారన్నారు. ఈకార్యక్రమంలో యాదవ మహాసభ నాయకులు నందకిశోర్ యాదవ్, హైకోర్టు న్యాయవాది బిక్షపతి యాదవ్, విద్యావంతుల ఫోరం నాయకులు వెంకట్‌యాదవ్, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఘనంగా మహర్షి వాల్మీకి శోభయాత్ర



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్,బిజెపి నాయకులు ఎం.కుమార్

చార్మినార్, అక్టోబరు 11 ప్రభాతవార్త : పాతబస్తీ మహర్షి వాల్మీకి నగర్‌లో సుల్తాన్‌షాహి వాల్మీక్ సమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా వాల్మీకి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాలలో వాల్మీకి శోభా యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాల్మీకి సమాజ్ ఛైర్మన్ రవీంద్ర చౌదరి,మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్, గోల్కొండ జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు ఎం.కుమార్,వాల్మీకి మందిరం మాజీ అధ్యక్షులు దేవేందర్‌సింగ్ రాణా,ప్రతినిధులు ఆశిష్ దౌల్‌గాష్,కులదీప్ పర్చ, సిద్దేశ్వర్‌సింగ్, విజయ్ మంగ్‌వానా,వివేక్ బిడ్లా పాల్గొన్నారు.

## గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో
# 3.5 కోట్ల నగదు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ధర్నాచౌక్, అక్టోబర్ 11, ప్రభాతవార్త: గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటల్ మారియట్ వద్ద 3.5 కోట్ల నగదును గాంధీనగర్ పోలీసులు, నార్త్‌జోన్ టాస్క్ ఫోర్స్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు గాంధీనగర్ పోలీసులు, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో జరిపిన తనిఖీలలో రెండు కార్లలో ఈ నగదు పట్టుబడింది. సాయికుమార్‌రెడ్డి, గండె మహేష్, మహేందర్, అనూప్‌రెడ్డి, భరత్, సందీప్ కుమార్ అదుపులోకి తీసుకుని విచారించగా వారు నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపలేకపోయారు. పోలీసులు నగదుతో పాటు రెండు కార్లను, ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఐపీసీ 102 ప్రకారం కేసు విచారిస్తున్నామని, వారు ఎటువంటి ఆధారాలు, పత్రాలు చూపకపోతే తదుపరి విచారణ కోసం నగదును ఆదాయపన్నుశాఖ వారికి అందచేస్తామని గాంధీనగర్ సీఐ మోహన్‌కుమార్ తెలిపారు.

## డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు, 5గురికి జరిమానా

చిక్కడపల్లి, అక్టోబరు 11 ప్రభాతవార్త: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్షణ మరో 5 గురికి జరిమానాలు విధించారు. నగరంలోని మహంకాళి ట్రాఫిక్ పిఎస్‌తో పాటు రెండవసారి చిక్కడపల్లి పరిధిలో పట్టుబడిన ఒక వ్యక్తికి 5రోజుల జైలుశిక్షతో పాటు రూ.3,300 జరిమానాను న్యాయమూర్తి విధిస్తూ తీర్పునిచ్చినటు చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాను నాయక్ వివరించారు. వీరితో మరో ఐదు మందికి రూ.2100 జరిమానా విధించారు.

**ఫ్రీలెఫ్ట్‌కు అడ్డుగా ఉన్నా, అక్రమపార్కింగ్, స్టాప్‌లైన్ దాటిచే ఫైన్**

ప్రధానరహదారితో పాటు ముఖ్య కూడళ్ళ వద్ద వాహనదారులు ఎడమవైపుకు వెళ్ళకుండా ఫ్రీలెఫ్ట్‌ను అడ్డుకుంటూ వాహనదారులు తమ వాహనాలు ఆపినా, రోడ్లపై అక్రమ పార్కింగ్ చేసినా, స్టాప్‌లైన్ (జీబ్రాలైన్)పైకి వచ్చినా జరిమానాలు విధించడం జరుగుతుందని నానునాయక్ హెచ్చరించారు. అప్పర్ ట్యాంక్‌బండ్‌పై వాహనాల వేగాన్ని మరింత నియంత్రించి ప్రమాదాలను నివారించాలనే సంకల్పంతో త్వరలో లేబర్‌స్పీడ్‌గన్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. లిమిట్‌కు మించి స్పీడ్‌తో ట్యాంక్‌బండ్‌పై వెడుతున్న వాహనచోధకులు స్పీడ్‌ను లేజర్‌స్పీడ్‌గన్ పసిగట్టి ఫోటోతో సహా సదరు వ్యక్తులకు పంపించడం జరుగుతుందని వివరించారు.

## ఆలయాల్లో హుండీలు పగులగొట్టి చోరీ

సరూర్‌నగర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త: దేవాలయాల్లోని హుండీలను పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రచారం బడంగ్‌పేట్ వెంకటాద్రినగర్ కాలనీ రోడ్డులో ఉన్న పోచమ్మ, మైసమ్మ అమ్మవార్ల ఆలయంలోకి సోమవారం రాత్రి ప్రవేశించిన గుర్తు తెలియని నిందితులు అక్కడి హుండీని బద్దలు కొట్టి అందులోని రూ. 25 వేల నగదును అపహరించుకొని పారిపోయారు. అదే విధంగా బడంగ్‌పేట్‌లోని బాలాజీనగర్ కాలనీ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో సైతం దుండగులు హుండీని పగులగొట్టి చోరీ చేశారు. ఈ మేరకు ఫిర్యాదులు అందడంతో మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రమాదాల నివారణకు చర్యలేవి..?

## నిత్యం సిఎం ప్రయాణించే మార్గంలో ఇంత నిర్లక్ష్యమా..?

### బేగంపేట ఫ్లై ఓవర్ వద్ద నిత్యం ప్రమాదాలు ● సూచిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడమే ప్రమాదాలకు కారణం



బేగంపేట లో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం

బేగంపేట అక్టోబరు 11, ప్రభాతవార్త : అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.ఈ ప్రమాదాలలో కొందరు తీవ్ర గాయాల పాలవుతుండగా, మరి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా అధికారులు మాత్రం ఇక్కడ ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎంతో మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగిన సమయంలో హడావిడి చేస్తున్నారు తప్ప ప్రమాదాల నివారణకు శాశ్వత నివారణ చర్యలు చేపట్టడం లో సంబంధిత శాఖల అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారని ప్రజలు విమర్శిస్తున్నారు.

**ప్రమాదాలకు కారణం..** ఇక్కడ ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం బేగంపేట ఫ్లై ఓవర్ పైన పంజాగుట్ట వైపు నుంచి వాహన దారులు వేగంగా ప్రయాణించడం ఒక కారణం కాగా ఫ్లై ఓవర్ దిగే ప్రాంతంలో ఫతేనగర్ లింక్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను గుర్తించలేకపోవడం మరో కారణం. ఫ్లై ఓవర్ దిగే వాహనదారులు, ఫతేనగర్ నుంచి వచ్చే వాహనదారులు ఇరువురు వేగంతో ప్రయాణించడం, రెండు ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలు ఒకే రోడ్డు పైకి చేరుకునే క్రమంలో వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఈ రెండు రోడ్లు కలిసే చోట నే సిటీ బస్సుల బస్టాప్ కూడా ఉంది. ఈ క్రమంలో ఫ్లై ఓవర్ నుంచి వస్తున్న బస్సులు ఫ్లై ఓవర్ దిగిన వెంటనే ఎడమ పక్కగా వస్తుంటాయి.ఈ క్రమంలో ఫతేనగర్ నుంచి వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు జరుగుతున్నాయి. ఈ రెండు రోడ్లపై నుంచి వచ్చే వారికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ముందు ఉన్న యూటర్న్ తీసుకునే క్రమంలో ఒక్క సారిగా వాహనాలు కుడి పక్కకు వెళ్లే ప్రయత్నంలో కూడా వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలో నిత్యం ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు ప్రయాణిస్తుంటారు. ఇలాంటి మార్గంలో ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం ప్రజలను తీవ్ర భయాం దోళనలకు గురి చేస్తున్నాయి.వారు ప్రయాణించే మార్గంలోనే అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు బేగంపేట ఫ్లై ఓవర్,ఫతేనగర్ లింక్ రోడ్డు కలిసే ప్రాంతంలో ప్రమాదాల నివారణకు సంబంధించిన సూచికల బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు,వాహన దారులు కోరుతున్నారు.

## ఈడీ దాడులు చేసిన మాధవరెడ్డి ఇంట్లో చోరీ

### రూ. 5 లక్షల నగదు అపహరణ

కంటోన్మెంట్, అక్టోబర్ 11 ప్రభాతవార్త : క్యాసినో కేసులో ఈడీ దాడులు చేసిన మాధవరెడ్డి నివాసంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కంసారిబజార్ ఆర్యసమాజ్ వద్ద నివాసం ఉంటున్న మాధవరెడ్డి నివాసంలో దొంగలుపడి రూ. 5లక్షలు దొంగిలించారు. ఈ మేరకు మాధవరెడ్డి భార్య సంధ్య బోయిన్‌పల్లి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కిడ్నాప్ నిందితుడు లంక మురళీ కృష్ణ అరెస్ట్



ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త: కిడ్నాప్ వ్యవహారంలో నిందితుడుగా ఉన్న బడంగ్ పేట్‌కు చెందిన లంక మురళీకృష్ణ(52)ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఇన్స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు నెలలో లంక సుబ్రహ్మణ్యం అనే యువకుడ్ని కిడ్నాప్ చేసిన వ్యవహారంలో లంక మురళీకృష్ణ కూడా నిందితుడిగా ఉన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతని గురించి చాలా రోజులుగా గాలిస్తున్నప్పటికి కూడా దిరకలేదు. మంగళవారం ఉదయం 10 గంటలకు మురళీకృష్ణ దొరకడంతో అతన్ని అరెస్టుచేసి రిమాండుకు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

## అర్చకులకు పెండింగు వేతనాలు అందించాలి

కొడంగల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త : దేవాలయాల్లో స్వామివారికి నిత్యం కైంకర్యాలను నిర్వహించే అర్చకులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని దూప,దీప,నైవేద్య అర్చక సంఘం(డిడీఎన్ఎస్) జిల్లా అధ్యక్షులు లోకూర్తి జయతీర్థాచారి కోరారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేక రులతో మాట్లాడుతు గత నాలుగు నెలలకు పైగా అర్చకులకు వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

## మైనర్ బాలికను వేధించిన కేసులో
# యువకునికి మూడు సంవత్సరాల జైలుశిక్ష

సరూర్‌నగర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త: ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధింపులకు గురి చేసిన కేసులో ఓ యువకునికి కోర్టు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించింది. కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. బాలాపూర్‌కు చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు యాచారం రమేష్ (23) అదే ప్రాంతానికి చెందిన ఓ పదిహేడేళ్ల అమ్మాయిని 2017లో ప్రేమ, పెళ్ళి పేరుతో వేధించాడు. ప్రేమించకుంటే చనిపోతానని కూడా బెదిరించాడు. దీంతో ఫిర్యాదు అందడంతో పోక్సో చట్టం కింద కేసును నమోదు చేసుకున్న మీర్‌పేట్ పోలీసులు నిందితుని అప్పట్లో అరెస్టు చేశారు. పోలీసులు కోర్టుకు సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టడంతో కోర్టు నిందితునికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.20 వేల జరిమాన విధిస్తూ తీర్పును వెలువరించింది.

## అనుమానాస్పదస్థితిలో ప్రైవేటు ఉద్యోగి మృతి



గచ్చిబౌలి, అక్టోబరు 11 ప్రభాతవార్త : అనుమానాస్పద స్థితిలో ఓ ప్రైవేటు ఉద్యోగి మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి మతన్‌పురి కాలనీకి చెందిన అశోక్‌కుమార్(39) రెండు వారాల క్రితం బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. గచ్చిబౌలిలోని టాటా టెలికాంలో పనిచేస్తూ కొత్తగూడలో ఉన్న ప్రియదర్శిని మెన్స్ హాస్టల్‌లో నివాసం ఉంటున్నాడు. గత సోమవారం ఉదయం 9 గంటలకు ఆరోగ్యం బాగోలేదని తాను పనిచేస్తున్న సంస్థకు తెలియజేశాడు. కడుపునొప్పితో బాధపడుతుండగా, తోటి స్నేహితులు అశోక్‌కుమార్‌ను కొండాపూర్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మ ృతిచెందాడు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు అశోక్‌కుమార్ తండ్రి నాతున్ ప్రసాద్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# డ్రైనేజీ లైన్‌కు మరమ్మత్తులు

## మున్నాళ్ల ముచ్చటే అంటున్న స్థానికులు



ఆంధ్రాబ్యాంకు వద్ద మరమ్మత్తులు చేస్తున్న దృశ్యం

**ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** డ్రైనేజీ మురుగునీరు పైపులైన్‌కు ఎట్టకేలకు మరమ్మత్తులు మొదలుపెట్టారు. గత నెల రోజులుగా డ్రైనేజీ పొంగుతుండడంతో స్థానికులు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరారు. చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్ కాలనీ యూనియన్ బ్యాంక్ రోడ్డు పూర్తిగా డ్రైనేజీ లీకేజి కారణంగా దుర్గంధంగా మారడంతో బ్యాంకు ఉద్యోగులతో పాటు స్థానిక కాలనీవాసులు అనారోగ్యానికి గురయ్యారు. సమస్య పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులతోపాటు స్థానిక కాలనీవాసులు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదు. మంగళవారం 'వార్త'లో ప్రచురితమైన 'పొంగుతున్న డ్రైనేజి పట్టించుకోని అధికారులు, అనారోగ్య ం పాలవుతున్న ఉదో ్యగులు, స్థానికులు, వికాస్‌నగర్‌లో దుర ్భర పరిస ్థితి' అనే కథనం తో జలమండలి అధికారులు స్పందించారు. వికాస్‌నగర్ బ్యాంకు వద్ద పొంగి పొర్లుతున్న డ్రైనేజీని తమ సిబ్బందితో కలిసి మంగళవారం మరమ్మత్తులు చేపట్టారు. అయితే ప్రతిసారి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని, అధికారుల తీరుపట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాగుచేసిన రెండు మూడు రోజులకే మళ్లీ డ్రైనేజీ పొంగుతుంద ని, మాకు అవస్థలు తప ్పడం లేదని, శాశ్వత పరిష్కారం ద్వారానే సమస్య తొలగిపోతుందని స్థానికులు అంటున్నారు. తాత్కాలిక మరమ్మత్తులు కాకుండా భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వార్డు సభ్యురాలు శోభారాణితో పాటు కాలనీవాసులు అధికా రులకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి



సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. భారత్ సురక్ష సమితి, ఆల్ ఇండియా లోక్ సంఘర్ష సమితి ఆధ్వర్యంలో 1975-77 ఎమర్జెన్సీ బాధితుల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పలుఅంశాలపై చర్చించారు. అదే విధంగా ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సందడి సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, అశోక్‌కుమార్, యమన్‌సింగ్, మాధవరెడ్డి, రవీందర్, సత్యనారాయణరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ మలక్‌పేటలో అభివృద్ధి పనులు : షఫీ



ఫెన్సింగ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సైపుద్దీన్ షఫీ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీ పేర్కొన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేపడుతున్న ఫెన్సింగ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణకోసం చెత్త, చెదారం వేయకుండా ఉండడంకోసం ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

# మునుగోడులో బిఎస్‌పి నేతల ప్రచారం



ప్రజలతో సమావేశమై ప్రచారం చేస్తున్న గుడ్ల శ్రీనివాస్

**సరూర్‌నగర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** ఉప ఎన్నిక జరుగుతున్న మునుగోడు నియోజకవర్గంలో మంగళవారం మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన బిఎస్‌పి నాయకులు ప్రచారం చేశారు. నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మునుగోడుకు తరలివెళ్ళిన నాయకులు కోదాష్‌పల్లి గ్రామంలో పర్యటించి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ మేరకు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎంపిక చేసిన అభ్యర్థి శంకరాచారిని గెలిపించాలని కోరారు. కాగా స్వంత ఖర్చుతో మునుగోడుకు వెళ్ళిన గుడ్ల శ్రీనివాస్ బృందం అక్కడి పార్టీ నాయకులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా తమ ఇళ్ళ నుండి తెచ్చుకున్న పచ్చడి భోజనాన్నే తిని తమ పార్టీ తీరును చాటడం గమనార్హం. ఈ కార్యక్రమంలో నాయకులు భాగ్యరాజ్, యాదయ్య, వెంకటేశ్, రాములు, గణేష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని జడ్‌సికి వినతి

**ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** డివిజన్‌లో సమస్యలు పరిష్కరించే విధంగాచర్యలు తీసుకోవాలని సరూర్‌నగర్‌డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ జడ్సీ పంకజకు కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్లు ఆమె తెలిపారు.

# సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం: ఎమ్మెల్యే



ఆంజనేయులుకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరమని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధి రంగనాయకుల గుట్టకు చెందిన ఆంజనేయులు ఏడాది కుమారుడు ప్రణవ్‌గణేష్ అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చేరగా... అతని వైద్యానికి 50వేల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగోలేని ఆంజనేయులు సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధినుంచి సదరు మొత్తాన్ని మంజూరు చేయించారు. ఈమేరకు సదరు చెక్కును ఆంజనేయులుకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్య సేవలకు అందించడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి అవసరమైన నగదును సైతం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధు ముదిరాజ్ పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించడంలో ముందుంటా : మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్



వాటర్‌వర్క్స్ జిఎంకు వినతి పత్రం సమర్పిస్తున్న లక్ష్మీప్రసన్నరామ్మోహన్‌గౌడ్

**వనస్థలిపురం, అక్టోబరు 10 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్‌గౌడ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ గ్రామం వడ్డెర బస్తీలోని భూగర్భ డ్రైనేజీ సమస్య గురించి తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందించిన లక్ష్మీ ప్రసన్న సమస్య పరిష్కరించాలని సాహెబ్‌నగర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేసి త్వరితగతిన ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జనరల్ మేనేజర్ తక్షణమే భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

# బాలికలు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి



బాలికల దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థినిలు

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త :** బాలికలు క్రమశిక్షణతో చదివి అన్ని రంగాలలో ముందుకు సాగాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జ్యోత్స్నప్రభ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... గతంలో ఆడశిశువు పుట్టిందంటేనే పురుడులోనే చంపినఉదంతాలు ఉన్నాయన్నారు. నేటి పోటీ ప్రపంచంలో బాలురతో పాటు బాలికలు చదువుతో పాటు ఇతర రంగాల్లో ప్రావీణ్యం సాధిస్తున్నారని, ప్రపంచ నలుమూలలా ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. క్రమంగా బాలికల శాతం కూడా పెరుగుతోందన్నారు. తల్లిదండ్రులు సైతం బాలికల అభ్యున్నతికి తోడ్పాటును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.వి.గీతానాయక్, డా.జుహెదాబేగం, రజిత పాల్గొన్నారు.

# బ్రాహ్మణులకు కెసిఆర్ చేయూత: మురుకుంట్ల



సమావేశంలో మాట్లాడుతున్న మురుకుంట్ల అరవింద్ శర్మ

**ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** బ్రాహ్మణులకు ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని మహేశ్వర ం నియోజకవర్గం టిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. ఆర్‌కెపురం డివిజన్ టిఆర్‌ఎస్ కార్యాలయ ంలో మంగళవారం బ్రాహ్మణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి రమణారావు, దేవులపల్లి రంగారావు, కె.శ్యామ్‌సుందర్‌రావు, సునీల్, దేవరపల్లి అశోక్, తాటికొండ అనురాధ, సత్యప్రకాష్‌రావు, అన్నమరాజు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అవసరమైన చోట నూతన వీది దీపాల ఏర్పాటు : కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి



ఎఇతో వీది దీపాల గురించి చర్చిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో అవసరమైన చోట నూతనంగా వీది దీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందరెడ్డి మంగళవారం ఎఇ రాజుకు సూచించారు. ఎఇతో సమావేశమై డివిజన్‌లో వీది దీపాల నిర్వాహణ, మరమ్మత్తు తదితర అంశాల గురించి చర్చించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పాడైన వీది దీపాల స్థానంలో కొత్తవి ఏరా ్పటు చేయాలని, అవసరమైన చోట నూతనంగా పోల్స్ ఏరా ్పటు చేయాలని సూచించారు.

# బిఆర్‌ఎస్ యువజన విభాగం కార్య నిర్వాహక అధ్యక్షునిగా నాగనందీశ్వర్‌రెడ్డి



నాగ నందీశ్వర్‌రెడ్డికి ఉత్తర్వులు అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ బిఆర్‌ఎస్ (భారత రాష్ట్ర సమితి) యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షునిగా బాలాపూర్‌మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ గ్రామానికి చెందిన యువ నాయకుడు పెద్దబావి నాగ నందీశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడమే కాకుండా వాటి విజయవంతానికి కృషి చేస్తున్న నాగ నందీశ్వర్‌రెడ్డి సేవలను నియోజకవర్గ వ్యాప్తంగా అవసరమని భావించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆయనను నియోజకవర్గ బిఆర్‌ఎస్ యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసి నందీశ్వర్‌రెడ్డికి మంగళవారం అందజేశారు.

**పార్టీలో యువతకు ప్రాధాన్యత: సబితారెడ్డి**

బిఆర్‌ఎస్‌లో యువతకు ప్రాధాన్యతనివ్వడం జరుగుతున్నదని మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నాగ నందీశ్వర్‌రెడ్డికి ఉత్తర్వులు అందజేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత కెసిఆర్ పార్టీలో యువతకు సముచిత స్థానం కల్పించారని అన్నారు. కెసిఆర్ బిఆర్‌ఎస్ పార్టీని ప్రకటించిన తర్వాత బిజెపిలో వణుకు ప్రారంభమైందనీ మోడీకి సరైన ప్రత్యర్థి కెసిఆరేనని ప్రజలు గుర్తిస్తున్నారని ఆమె తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీని దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారని ఆమె అన్నారు. నూతనంగా నియమితులైన నాగ నందీశ్వర్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీకి యువతకు మధ్య అనుసంధానంగా ఉంటూ పని చేస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జిల్లెల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, పెద్దబావి సమరసింహారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, ఇఎల్‌వి అశోక్, గౌర సాయికుమార్, సంతోష్‌కుమార్, పన్నాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు ఎన్నికల ప్రచారంలో ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి విస్తృత ప్రచారం



మునుగోడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి, టిఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 11 ప్రభాతవార్త :** మునుగోడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. చౌటుప్పల్ మండల పరిధిలోని పలు డివిజన్‌లో చిలుకానగర్ డివిజన్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గరిక సుధాకర్, వేముల సంతోష్‌రెడ్డి తదితరులతో కలిసి ప్రచారం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందన్నారు. టిఆర్‌ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ నాయకులు పల్లె నర్సింగ్‌రావు, డా.బి.వి.చారి, జెసిబి రాజు, మస్క సుధాకర్, కృష్ణారెడ్డి, భద్రుద్దీన్, ఈర్షద్‌ఖాన్, మాస శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్‌లో నెలకొన్న పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్ శ్రీవాణి



డివిజన్ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 11 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్ డిఇ చందన, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చెత్తచెదారం సరిగ్గా లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని, దీంతో అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలనీలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని స్థానికులకు సూచించారు. అదే విధంగా పలు కాలనీలో సిసిరోడ్డు ప్యాచ్ పనులను ఆమె పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, సంకూరి కుమారస్వామి, నారాయణదాసు, దయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి : చింతల



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న చింతల సురేందర్ యాదవ్

**ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం నాగోల్ డివిజన్ రామాంజనేయ నగర్ కాలనీ, ధనలక్ష్మి కాలనీ, బృందావనం కాలనీ లలో జలమండలి డిజిఎం శ్రీనివాస్, మేనేజర్ అలేఖ్యతో కలిసి సురేందర్ యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నూతన డ్రైనేజీ వ్యవస్థ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత లోపాల కారణంగానే ట్రంక్‌లైన్ కృంగిపోయింది : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



ట్రంక్‌లైన్ కృంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, అక్టోబరు 10 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని కారణంగానే డ్రైనేజీ ఔట్‌లెట్ కృంగి పోయిందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మండిపడ్డారు. డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో ట్రంక్‌లైన్ ధ్వంసమై రోడ్డు కృంగిపోయిన విషయాన్ని కాలనీవాసుల ద్వారా తెలుసుకున్న ఆయన మంగళవారం దానిని పరిశీలించారు. ట్రంక్‌లైన్ ప్రాంతంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో అది కృంగిపోయినట్లుగా కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. ట్రంక్‌లైన్ నిర్మాణంలో కాంట్రాక్టరు నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడం... అధికారులు సైతం పట్టిపట్టనట్లుగా వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణ చేపట్టి అభివృద్ధి పనుల్లో నాణ్యతను కొనసాగించేలా కాంట్రాక్టర్లను ఆదేశించాలని డిమాండ్ చేశారు. నాణ్యతను పాటించని కాంట్రాక్లర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని నరసింహారావునగర్, సుభద్రనగర్‌లో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. పటిష్టమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీవాసులు తరుచూ ఇబ్బందుల పాలవుతన్నారని తెలిపారు. మెరుగైన ప్రణాళికను సిద్ధం చేసి మురుగు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్, సివరేజ్‌బోర్డు అధికారులు వాహిని, బాలునాయక్, శానిటేషన్ సూపర్‌వైజర్ మధు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కామాటి యాదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కామాటి పని చేసే కార్మికుడు ఆలకుంట యాదయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కమీషనర్ నాగేశ్వర్‌రావును కోరింది. మంగళవారం యూనియన్ నాయకులు మృతి చెందిన యాదయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన అనంతరం కమీషనర్‌ను కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదయ్య అంత్యక్రియలకు రూ.20 వేల నగదు ఇవా ్వలనీ, యాదయ్యది పేద కుటుంబమైనందున అందులో ఒకరికి కార్పొరేషన్‌లో ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిషన్, దాసరి బాబు, కార్పొరేషన్ సూపర్‌వైజర్స్ దాసరి జీవన్, దాసరి రంజిత్, కార్మికులు సిహెచ్ యాదగిరి, బావమ్మ, జంగయ్య, నరేందర్, నరి ్సంహ, శ్రీధర్, మహిపాల్, తులసిమయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలుస్తాం : చిలుక



విధ్యార్థినికి చెక్కు అందజేస్తున్న మధుర ఉపేందర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** నిరుపేద విధ్యార్థులకు అండగా నిలుస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీకి చెందిన పర్మిల నిస్సం అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ పోతరాజు సైదులు కుమార్తె సుష్మ ఉన్నత చదువుల కోసం అవసరమైన ఫీజును చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు మంగళవారం వాసవి కాలనీలోని ఆయననివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం పక్కన పెట్టి చదువు పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంగాల శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, జహంగీర్, విప్లవ్, జగదీష్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కిల్ అధికారులతో డిసి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఉప కమిషనర్ మారుతి దివాకర్

**ఎల్‌బినగర్, అక్టోబరు 11 ప్రభాతవార్త:** హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని వివిధ విభాగాలు చెందిన అధికారులతో మంగళవారం సాయంత్రం హయాత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ మారుతీ దివాకర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పన్నుల వసూలు, డబల్ బెడ్ రూమ్ లకు సంబంధించిన విచారణ తదితర అంశాలపై చర్చ నిర్వహించారు.

# హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా గొరిగె మల్లేష్

**ఉప్పల్, అక్టోబరు 11 ప్రభాతవార్త :** ఉప్పల్‌కు చెందిన సీనియర్ న్యాయవాది గొరిగె మల్లేష్ తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా మూడవసారి నియమించింది. అదే విధంగా తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఓయు నుంచి 1998లో ఉత్తీర్ణులై బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని ప్రాక్టీస్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో గొరిగె మల్లేష్ కీలక పాత్ర పోషించారు. సిఎం కెసిఆర్ ఆయన సేవ లు గుర్తించి హైకోర్టు ఎజిపిగా నియమించింది. హైకోర్టులో అపిల్స్, అర్బిట్రే షన్, హౌజింగ్ బోర్డు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదితర విభాగాల్లో ఎజిపిగా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. టిఆర్‌ఎస్ లీగల్ సెల్‌లో చురుకైన పాత్ర పోషించారు. లాయర్స్ ఫోరం సోషల్ జస్టిస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. ప్రముఖపర్యాటక క్షేత్రం వెలుగుగుట్ట శ్రీ దుర్గా మల్లికార్జునస్వామి పునః నిర్మాణంలో కీలక పాత్ర పోషించి మంచి గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మల్లేష్‌ను అభినందించారు.